సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



మాదిగలను గుర్తించింది సీఎం జగనే

స్వాతంత్య్రం వచ్చిన తరువాత మాదిగలకు సామాజిక, రాజకీయ గుర్తింపు లభించింది సీఎం జగన్ ప్రభుత్వంలోనేనని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో



అన్నదానానికి విరాళం

సామర్లకోట: బాలాత్రిపురసుందరీ సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తురాలు కాదా సీత సోమవారం రూ.లక్ష విరాళాన్ని ఈఓ టీవీ సూర్యనారాయణకు అందజేశారు.

తూర్పు డెల్టాకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టా కాలువకు 600 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు. సముద్రంలోకి 12,124 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహనం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): **జిల్లాను చెత్త** రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి **ఒక్కరూ పరి**శుభ్రతను పాటించాలని కలెక్టర్ **మాధవీలత** అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో **4 లక్షల తడి,** పొడి చెత్త డబ్బాల పంపిణీ **కార్యక్రమాన్ని** జాయింట్ కలెక్టరు తేజ్‌భరత్ ఇతర అధికారులతో కలసి ఆమె సోమవారం ప్రారంభించారు. మహిళలకు తడి, పొడి చెత్త డబ్బాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి రెండు డబ్బాల చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసి మొక్కలకు ఉపయోగించవచ్చన్నారు.పొడి చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా ఉపయోగించుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తోందన్నారు. డీపీఓ జేవీ.సత్యనారాయణ, బీసీ సంక్షేమ అధికారి పి. రమేష్, డిఎస్‌ఓ పి. విజయ భాస్కర్ తదితరు పాల్గొన్నారు.

సత్రం డోనార్ స్కీమ్‌కు రూ.5 లక్షల విరాళం



రూ.5 లక్షల చెక్కును దేవస్థానం అధికారులకు అందజేస్తున్న దాత కవిత, డాక్టర్ రవికుమార్ దంపతులు

అన్నవరం: స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్రం డోనార్ స్కీమ్ కింద స్థానిక మునుసుబు గారి వీధికి చెందిన పువ్వుల కవిత రూ.ఐదు లక్షలు విరాళంగా సోమవారం సమర్పించారు. ఈ మొత్తాన్ని అంబుల రామరాజు, భాస్కరమణి పేర్ల మీద హరిహరసదన్ సత్రం రూమ్ నంబర్ 218 నిర్మాణానికి జమ చేయాలని కోరారు. ఈ మేరకు దాత కవిత, డాక్టర్ పి.రవికుమార్ దంపతులు చెక్కును దేవస్థానం అధికారులకు అందజేశారు.

నయనానందకరం శివపార్వతుల కల్యాణం



కాకినాడ శ్రీపీఠంలో శివపార్వతులకు పవిత్ర గంగానదీ జలాలతో కూడిన పంచామృత అభిషేకాలు చేస్తున్న పరిపూర్ణానందస్వామి

కాకినాడ రూరల్: కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం పవిత్ర కార్తికమాసంలో ఆధ్యాత్మికంగా పరిఢవిల్లుతోంది. పరిపూర్ణానందస్వామి దివ్య ఆశీస్సులతో గత నెల 14న మహాశక్తి యాగం తలపెట్టిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి దిగ్విజయంగా యాగం కొనసాగుతోంది. సోమవారం నాటికి యాగం 28వ రోజుకు చేరుకుంది. ఇప్పటికే 100 కోట్ల లలిత కుంకుమార్చనలు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం కోటి బగళాముఖి జపాలు కూడా పూర్తయ్యాయి. కార్తిక మాస చివరి సోమవారం, మాస శివరాత్రి కావడంతో శ్రీ పీఠంలో మహాశక్తి యాగం వేదికగా పార్వతి, పరమేశ్వరుల కల్యాణాన్ని తలపెట్టారు. ఉదయం నక్షత్ర శాంతి పూజలు, లలిత కుంకుమార్చనలను నిర్వహించారు. తరువాత గంగానది ఏడుపాయల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో శివపార్వతులకు పరిపూర్ణానందస్వామీజీ పంచామృత జలాభిషేకం చేయించారు. తరువాత శాస్త్రోక్తంగా మంగళస్నానం నిర్వహించారు. మహాశక్తి యాగం 28వ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు హాజరయ్యారు. ఆయన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. చాగంటి స్వస్థలం కాకినాడ కావడం గర్వకారణమని పరిపూర్ణానందస్వామి అన్నారు. ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించాలని ఆకాంక్షించారు. చాగంటి కోటేశ్వరరావుకు టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు సన్మానం చేశారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సభ్యులు శ్రీపీఠం యాగశాలలో ఉదయం శివలింగానికి అభిషేకం, బగళాముఖి హోమంలోను పాల్గొన్నారు. సాయంత్రం కోటిదీపోత్సవం ఘనంగా జరిగింది. దీపోత్సవ వేదిక వెనుక శివలింగం వద్ద ఉన్న మహాజ్యోతులను స్వామి పరిపూర్ణానంద వెలిగించారు. దీపోత్సవం అనంతరం పార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వేలాదిగా భక్తులు తిలకించారు.



శివపార్వతుల కల్యాణానికి వేలాదిగా హాజరైన భక్తులు

శరవేగంగా సాయం

- తుపానుపై ఫలితాలనిచ్చిన ముందస్తు అప్రమత్తం
- ఇళ్ల బాధితులకు వెనువెంటనే ఆర్థిక సహాయం
- ఆరు పునరావాస కేంద్రాలతో తక్షణ ఆసరా
- ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుతో రైతులకు అండ



తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో ముంపు బాధితులకు తక్షణ ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: తుపాను వస్తే ప్రజలు ఎన్నో కష్టాలు పడేవారు. నిరాశ్రయులై పడే బాధలు అన్నీ ఇన్నీ ఉండేవి కావు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ముందస్తు ప్రణాళికతో అధికార యంత్రాంగాన్ని నడిపిస్తోంది. నిన్నగాక మొన్న వచ్చిన మిచాంగ్ తుపాను సందర్భంలోనూ సమర్థంగా స్పందించి సత్తా చాటుకుంది. బాధితులకు శరవేగంగా సాయం అందేలా చూసింది. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ బాధితుల పక్షాన నిలిచింది. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సకాలంలో చర్యలు తీసుకుంది. ముఖ్యంగా ముందస్తుగా అప్రమత్తత వల్ల నష్ట తీవ్రతను తగ్గించడంతో సఫలీకృతమైంది.

ఇళ్లపై గాలుల ప్రభావం

తుపాను సమయంలో భారీ గాలులు వీచాయి. అక్కడక్కడా సుడిగాలులు ఇళ్లపై ప్రతాపం చూపాయి. అయితే వెనువెంటనే అధికారులు దెబ్బతిన్న ఇళ్లను గుర్తించారు. బాధితులకు తక్షణ సాయంగా రూ.10వేలు వంతున ఆర్థిక సాయం అందజేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరిన బాధితులకు కోసం ఏడు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక, పైడి మెట్ట గ్రామాలతో పాటు నల్లజర్ల మండలం దూబచర్ల, సింగరాజుపాలెం,నల్లజర్ల తదితర చోట్ల ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వరద తీవ్రత తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే ప్రజలకు ఆశ్రయం కల్పించారు. భోజన వసతి సమకూర్చారు. వరద ముంపు నుంచి తేరుకుని ఇళ్లకు వెళ్లే సమయంలో బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.2,500 నగదు అందజేశారు. ఒక వ్యక్తి ఉంటే రూ.1,000 చొప్పున ఆర్థిక సాయమిచ్చారు. ఇలా జిల్లాలో రూ.4 లక్షలు అందజేశారు.



కొవ్వూరులో కళ్లాల్లో ధాన్యం తరలింపు విషయంపై రైతులతో మాట్లాడుతున్న అధికారులు

లెక్కలు తేల్చి సాయం

జిల్లా వ్యాప్తంగా తుపాన్ ప్రభావంతో ఇళ్లు దెబ్బతిన్న 173 కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.17.30 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. సీతానగరం మండలంలో గరిష్టంగా 22, నిడదవోలులో 18,గోపాలపురంలో 17, పెరవలిలో 12, రాజానగరంలో 11, కడియం, దేవరపల్లి మండలాల్లో 10, రాజమహేంద్రవరం రూరల్, నల్లజర్ల మండలాల్లో 13వంతున , కొవ్వూరులో 8, గోకవరం, చాగల్లు మండలాల్లో మూడు వంతున ఇళ్లు, బిక్కవోలులో రెండు,కోరుకొండలో ఏడు, రాజమహే ంద్రవరం అర్బన్‌లో నాలుగు, తాళ్లపూడి,ఉండ్రాజవరం మండలాల్లో ఏడేసి చొప్పున గృహాలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేలు లెక్కన ఆయా ప్రాంత ప్రజాప్రతినిధుల ద్వారా సాయాన్ని బాధితు లకు అందజేశారు.

బాధితులకు నిత్యావసరాలు

జిల్లా వ్యాప్తంగా 700 ముంపు బాధిత కుటుంబాలకు బియ్యం,నిత్యావసర సరుకులు అందజేశారు. కుటుంబానికి 25 కిలో బియ్యం చొప్పున 17.5 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం అందజేసింది. కంది పప్పు,బంగాళా దుంప,ఉల్లిపాయాలు కిలో వంతున ఏడు టన్నుల కూరగాయలు పంపిణీ చేశారు. కుటుంబానికి కిలో చొప్పున 700 కిలోల ఆయిల్‌నుఅందజేశారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కోనుగోళ్లు

తుపాను నేపథ్యంలో ఈ నెల 3 నుంచే ఆఫ్‌లైన్‌లో తేమ శాతంతో సంబంధం లేకుండా అధికారులు కోనుగోళ్లు చేశారు. కొనుగోళ్లకు మండలానికి ఒక ప్రత్యేక అధికారితో పాటు ఎంపీడీఓ, తహసీల్దార్,మండల వ్యవసాయ శాఖాధికారితో మండల కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 70,827 హెక్టార్లు ఆయకట్టులో సాగు అయ్యింది. తుపాను నాటికి 46,416 హెక్టార్లలో ఆయకట్టులో వరి మాసూళ్లు పూర్తయ్యాయి. 24,316 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలున్నట్లు గుర్తించారు. అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి 8వతేదీ రాత్రికి 23,958.34 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి మిల్లర్లు తరలించారు.

రామాయణం వేద స్వరూపం

సమన్వయ సరస్వతి షణ్ముఖ శర్మ



రామాయణ హవనంలో ప్రసంగిస్తున్న షణ్ముఖ శర్మ

రాజమహేంద్రవరం రూరల్: రామాయణాన్ని అనేక **మంది వివిధ** కోణాల్లో చూస్తున్నారు. కొందరు **సాహిత్యకోణం**లో పరిశీలిస్తున్నారు. మరి కొందరు **ధర్మపురుషార్థం** మాత్రమే రామాయణంలో **చెప్పారని భా**విస్తున్నారు. కానీ రామాయణం వేద **స్వరూపమని** సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి–42 రోజుల పాటు రాజమహేంద్రవరం, హిందూ సమాజంలో ప్రారంభం కానున్న రామాయణ ప్రవచనాలకు నాందిగా కొంతమూరు వల్లభగణపతి ఆలయ ప్రాంగణంలో ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన రామాయణ హవనం పూర్ణాహుతి సోమవారం జరిగింది. పూర్ణాహుతిలో పాల్గొన్న సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ వేదంలో చెప్పని అంశం కావ్యంలో స్వీకరించకూడదు. రామాయణాన్ని వేదంగా చూడటమే అసలైన దృష్టి, సంప్రదాయ దృష్టి అని పేర్కొన్నారు. ధర్మాన్ని ఆచరించి చూపినవాడు రాముడు, రామానుగ్రహం ఉంటే గానీ రాముని హృదయం గోచరించదని ఆయన వివరించారు. దశరథునికి రాముడు పిల్లవాడు, రావణునికి మానవమాత్రుడు, ఋషులకు మాత్రం భగవంతుడిగా కనిపించాడని ఆయన వివరించారు. సందేహం లేదు, వాల్మీకి రామాయణం ప్రామాణికం, కానీ ఇతర ఆర్ష రామాయణాలు అప్రమాణికాలు కావని సామవేదం అన్నారు. రామాయణంలోని శ్లోకాలు మంత్రములేనని ఆయన వివరించారు. స్వాధ్యాయరత్న గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, అప్పాజీ, పలువురు వేదపండితులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రవచనాలు

రాజమహేంద్రవరం టి.నగర్‌లోని హిందు సమాజంలో బుధవారం నుంచి సాయంత్రం 6.30 గంటలకు వాల్మీకి రామాయణంపై సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు ప్రారంభం కానున్నాయి. 2024 జనవరి 23వ తేదీన వివిధ సాగర, నదీజలాలతో జరిగే సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంతో ప్రవచన మహాసభలు ముగియనున్నాయి. మహామహోపాధ్యాయులు విశ్వనాథ గోపాలకృష్ణ, శలాక రఘునాథ శర్మ, స్వాధ్యాయరత్న గుళ్ళపల్లి సీతారామచంద్రఘనపాఠి తదితర ప్రముఖులతో ఆహ్వాన సంఘం ఏర్పాటయింది.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ లో వేచి ఉన్న భక్తులు

అన్నవరం: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో సత్యదేవుని సన్నిధికి భక్తులు భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజాము ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం భక్త జనసందోహంతో నిండిపోయింది. సుమారు 70 వేల మంది దర్శించారని అంచనా. 6,841 వ్రతాలు జరిగాయి. దీంతో కార్తికమాసంలో ఇప్పటి వరకు 1,25,659 వ్రతాలు జరిగాయి. ఆన్‌లైన్ వ్రతాలతో కలిపితే సంఖ్య 1,42,373కి చేరుకుంది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 60 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి కే సుమారు పది వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. దీంతో భక్తుల రద్దీని తట్టుకునేందుకు స్వామివారి ఆలయాన్ని సోమవారం తెల్లవారుజామున ఒంటిగంటకు తెరిచారు. స్వామివారి వ్రతాలు కూడా ప్రారంభించారు. అనంతరం దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటల వరకు రద్దీ కొనసాగింది. రద్దీ కారణంగా అంతరాలయ దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం వరకు యంత్రాలయం ప్రదక్షిణ దర్శనాలను నిలిపివేశారు. వ్రతాల ద్వారానే సుమారు రూ.35 లక్షలు ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.19 లక్షలు వచ్చింది. సుమారు 15 వేల మందికి పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు.

నిర్ణీత కాలవ్యవధిలో అర్జీల పరిష్కారం



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

- స్పందనకు 197 ఫిర్యాదులు
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనకు ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరశింహులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. స్పందనకు జిల్లావ్యాప్తంగా 197 అర్జీలు అందాయన్నారు. ఇందులో ఆన్‌లైన్‌లో 172, ఆఫ్‌లైన్‌లో 25 స్వీకరించామన్నారు.

పోలీసు స్పందనకు 42 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 42 ఫిర్యాదుల అందాయి. జిల్లా ఎస్పీ పి.జగదీష్ అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదు దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ, ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు. కాగా.. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులను తిరిగి బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక పోలీసు స్పందన వాహనాన్ని ఏర్పాటు చేశారు.

పంచారామ క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

సామర్లకోట: పంచారామ క్షేత్రం శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరాస్వామి ఆలయంలో కార్తిక మాస చివరి సోమవారం, మాస శివరాత్రి కావడవంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారి తొలి అభిషేకం, తొలి పూజలు తిలకించదానికి భక్తులు తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూలైన్లలో బారుల తీరారు. అమ్మవారికి కుంకు మార్చనలు చేశారు.ఆలయంలో ధ్వజ స్తంభం, రావిచెట్టు, జమ్మిచెట్టు, ఉసిరిచెట్టు, తులసి మొక్కల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి భక్తులు అభిషేకాలు చేశారు. పాలతోను, కోనేరులో నీటిని బిందెలతో తీసుకొని వచ్చి అభిషేకాలు చేసుకున్నారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారికి తొలి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

దేదీప్యమానంగా జ్యోతిర్లింగార్చన



జ్యోతులతో శివలింగం నమూనా


అన్నవరం: కార్తిక బహుళ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి అన్నవరం రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగార్చన దేదీప్యమానంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రధానాలయం నుంచి అనివేటి మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ వేదికపై స్వామి అమ్మవార్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత లింగాకారంలోని శివునికి పూజలు చేశారు. అనంతరం పండితుల మంత్రోచ్చారణల మధ్య శివలింగాకారంలో ఏర్పాటు చేసిన జ్యోతులను వెలిగించారు. స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన అర్చకులు ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, సుధీర్, దత్తాత్రేయ శర్మ, పవన్ తదితరులు పూజలు చేశారు. రాత్రి 7–30 గంటల వరకూ కార్యక్రమం కొనసాగింది. వేడుక పూర్తయ్యాక భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సెలవుపై అన్నవరం దేవస్థానం ఈఓ

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ వ్యక్తిగత కారణాలతో ఈనెల 12 నుంచి 21 వరకు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాస మూర్తిని ఇన్‌ఛార్జి ఈఓగా నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు.

యువ న్యాయవాదులకు సహాయమిలా

- వైఎస్సార్ లా నేస్తం కింద రూ. 42.20 లక్షలు జమ
- జిల్లాలో 844 మంది యువ న్యాయవాదులకు లబ్ధి
- నమూనా చెక్‌ను అందించిన కలెక్టర్ మాధవీలత
- హర్షం వ్యక్తం చేస్తున్న యువ న్యాయవాదులు



నమూనా చెక్‌ని అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కొత్తగా న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన యువ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తోందని కలెక్టర్ మాధవీలత చెప్పారు. వృత్తిలో చేరిన తొలి మూడు సంవత్సరాల పాటు నెలకు 5 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం విడుదల చేస్తోందన్నారు. వైఎస్సార్ జగనన్న లా నేస్తం కార్యక్రమం కింద ఈ ఏడాది జూలై నుంచి డిసెంబరు వరకూ ఆర్థిక సాయాన్ని విడుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రారంభించారు. నాలుగో ఏడాది కూడా నిధులు విడుదల చేసిన ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి కలెక్టర్ మాధవీలత, డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించి డెమో చెక్కును వారు లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి రెండవ విడతగా జిల్లాలోని 844 మంది న్యాయవాదుల ఖాతాలకు 6 నెలలకు గాను రూ.42.20 లక్షలు ప్రభుత్వం జమ చేసిందన్నారు. లబ్ధి పొందిన న్యాయవాదుల్లో 189 మంది ఎస్సీలు, 307 మంది బీసీలు, 324 మంది ఓసీలు, 24 మంది ఎస్టీలు ఉన్నారన్నారు. వీరందరికీ జగనన్న లా నేస్తం కింద ప్రయోజనం చేకూరిందని తెలిపారు. వైఎస్సార్ లా నేస్తం పథకం కింద సాయం యువ న్యాయవాదులకు చేదోడు వాదోడుగా నిలుస్తోందని డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రెసిడెంట్ డీవీవీ త్రినాథ్, కార్యదర్శి పీ వీవీఎస్బీ రాజు, పట్టణ ప్రెసిడెంట్ సుమన్ పాల్, హితకారిణి సమాజం ఛైర్ పర్సన్ కె. మణికుమారి, కొవ్వూరు టౌన్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, పలువురు న్యాయవాదులు, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నాను



వైఎస్సార్ లా నేస్తం కింద అందచేస్తున్న రూ.5 వేల స్టైఫండ్ నాకు ఎంతో ఉపయోగం పడుతోంది. ఈ పథకం ద్వారా ఆరు మాసాలకు సంబంధించి ఒకేసారి 30 వేల రూపాయలు ఖాతాలో జమవుతుంది. ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను. ఎగ్జామ్స్, ఎఎల్ఎల్ఎం, లైబ్రరీ ఖర్చులకు ఉపయోపడుతోంది.

– అయితంరెడ్డి శిరీష, కడియం

యువ న్యాయవాదులకు చేయుత



జిల్లా కోర్టులో అప్రంటీస్ చేస్తున్నాను. న్యాయవాద వృత్తిలోకి వస్తున్న మా లాంటి యువతను వైయస్ఆర్ లా నేస్తం ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. అందులో భాగంగా మాలాంటి యువ న్యాయవాదులను కూడా గుర్తించి ఆర్థిక చేయుత నివ్వడం సంతోషంగా ఉంది. ఆరు మాసాల సొమ్ము ఒకేసారి వేయడం వల్ల మేలు జరుగుతోంది.

– అడపా మణికంత, రాజమహేంద్రవరం

రూ.85 వేలు లబ్ధి చేకూరింది



నేను లా వృత్తిని చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం ద్వారా రూ.85 వేల రూపాయలు ఖాతాలో జమ చేసింది. ఈ ఏడాది రెండవ విడతలో ఆరు మాసాలకు సంబంధించి రూ.30 వేల రూపాలు జమ చేశారు. యువ న్యాయవాది వృత్తి తొలి దశలో ఉన్న మా ఇబ్బందులను గుర్తించి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం మా ఎదుగుదలకు ఉపయోగ పడుతుంది. సీఎంకు కృతజ్ఞతలు

– శేసెట్టి వీరమణికంత, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

సాగర తీరాన నేడు మహా కుంభాభిషేకం

కాకినాడ రూరల్: సాగర తీరాన శ్రీ మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామి ఆలయంలో 48వ మహా కుంభాభిషేకం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్తిక అమావాస్యను పురస్కరించుకుని కుంభాభిషేకం రేవు వద్ద ఆలయంలో కోటీ 8 లక్షల శివలింగాలకు అభిషేకం చేయనున్నారు. ఉదయం 7 గంటలకు గో పూజ, అనంతరం విఘ్నేశ్వర పూజ, వేద పఠనం, రసలింగేశ్వరునికి విబూదితో అభిషేకం చేస్తారు. అనంతరం అభిషేక విబూదిని సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ఉదయం 9.38 గంటలకు కోటీ 8 లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. ద్వాదశ లింగాలకు బిల్వార్చన, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం, ఆదికుంభేశ్వరస్వామికి బిల్వార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. మధ్యాహ్నం లలితా సహస్ర నామాలలో కుంకుమార్చన, 3 గంటలకు మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామికి కల్యాణం, హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు 101 మంది కన్యలతో అభిషేక జలాలను సాగరంలో నిమజ్జనం చేయనున్నారు. మహా కుంభాభిషేకం కోసం కుంభాభిషేకం రేవును ముస్తాబు చేశారు.

మాదిగలను గుర్తించింది సీఎం జగనే

- ఈ ప్రభుత్వంలోనే చర్మకారులకు సంక్షేమం
- రాజకీయ ఆత్మీయ మహాసభలో మంత్రి ఆదిమూలపు సురేష్

అమలాపురం రూరల్: స్వాతంత్యం వచ్చిన నాటి నుంచి గత 75 ఏళ్ల చరిత్రలో మాదిగలకు సామాజిక, రాజకీయ గుర్తింపు లభించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనేని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. అమలాపురం పట్టణం శివారు కొంకాపల్లి సత్తెమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం జరిగిన మాదిగలు, ఉప కులాల రాజకీయ ఆత్మీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, చర్మకారులకు జగన్ ప్రభుత్వంలోనే పెన్షన్ తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. ఇంతటి గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను మాదిగలు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. మరో అతిథి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్తనైన తనను ఓ ఎంపీగా పార్లమెంటుకు పంపించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్ బొమ్మి


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సురేష్, ఎంపీ సురేష్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ మాదిగలను చట్టసభలకు పంపించలేదని గుర్తు చేశారు. అటువంటి చరిత్రను ముఖ్యమంత్రి జగన్ తిరగరాస్తూ తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి, శాసన మండలికి పంపించారని అన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ కాకిమాను రాజశేఖర్, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా కూడా ప్రసంగించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను, ఐక్యతను చాటారు. తొలుత సభా వేదికపై బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు మంత్రి సురేష్, ఎంపీ సురేష్ పూలమాలలు వేసి, మహాసభను ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞత చాటారు. అనంతరం మంత్రి సురేష్, ఎంపీ సురేష్‌లను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గజమాలలతో సత్కరించారు. ఇజ్రాయిల్ ఆధ్వర్యాన జరిగిన ఈ మహాసభలో మాదిగ నాయకులు చెట్ల సత్యనారాయణ, మడికి శ్రీరాములు, ఆకుమర్తి సత్యనారాయణ, లూటుకుర్తి సత్యనారాయణ, పెదపూడి ఏడుకొండలు, మోకాటి దుర్గారావుతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ ఆరంభం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డైట్ ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీల్లో జరగనున్నాయి. తొలి రోజున ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 13 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల నుంచి 9, 10, 11, 12 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు 20 మంది పాల్గొన్నారు. గాత్రం(సంగీతం, జానపద), వాయిద్య సంగీతం (వాయిద్యం, మెలొడీ), నాట్యం (సంప్రదాయ, జానపద) విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా తమ ప్రతిభ చాటారు. మంగళవారం డ్రాయింగ్, మట్టిబొమ్మల తయారీ, సంప్రదాయ ఆటబొమ్మల తయారీ, ఏకపాత్రాభినయం పోటీలుంటాయని ప్రిన్సిపాల్ రమణ తెలిపారు.

తొలి రోజు విజేతలు వీరే..

బాలికల విభాగం: గాత్రం (జానపదం) ఎస్.రిత్వికాంజలి, ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హుకుంపేట; వాయిద్య సంగీతం (మెలొడీ) జి.కృష్ణ సంహిత, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్, కాకినాడ; నృత్యం (క్లాసికల్) ఎస్.గీతా మాధురి, జెడ్పీ హైస్కూల్, కత్తిపూడి; నృత్యం (జానపదం) కె.మమత, పీఆర్ జూనియర్ కళాశాల) ప్రథమ స్థానాలు సాధించారు.


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ అధ్యాపకులు


కళా ఉత్సవ్ పోటీల్లో అలరించిన విద్యార్థిని నృత్యం

బాలుర విభాగం: వాయిద్య సంగీతం కె.కార్తికేయ, రవీంద్ర విద్యా నికేతన్, దానవాయిపేట), నృత్యం (జానపదం) జె.భానుప్రకాష్, జెడ్పీ హైస్కూల్, కడియం ప్రథమ స్థానాలు పొందారు. ఈ విజేతలు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారని రమణ తెలిపారు.

బదనికలకు జాతీయ స్థాయి గుర్తింపు

అంబాజీపేట: కొబ్బరితో పాటు వివిధ పంటలపై ఆశిస్తున్న తెగుళ్లను అరికట్టేందుకు వినియోగిస్తున్న జీవకారక నియంత్రణలకు (బదనికలు) జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందని కాసరగోడ్‌లోని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.అగస్టీన్ జెరార్డ్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, అఖిల భారత వన్య పంటల పథకం (ఏఐసీఆర్పీ) పరిశోధన ప్రగతిని పరిశీలించేందుకు అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి సోమవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బదనికలను వివిధ రాష్ట్రాల్లో వినియోగించేలా చూస్తామని అన్నారు. ఇక్కడి పరిశోధనలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో పరిశోధనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో ఏఐసీఆర్పీ ఆన్ పామ్స్ పథకంలో నిర్వహిస్తున్న పరిశోధనలను, పరిశోధన కేంద్రం ప్రగతిని, బదనికల ప్రయోగశాలను నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ పాథాలజీ, హార్టికల్చర్ విభాగాల్లో పరిశోధనలు, జీవనియంత్రణ ప్రయోగ శాల ప్రగతిని కేంద్రం అధిపతి ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, డాక్టర్ వి.అనూష, శాస్త్రవేత్త ఎ.కిరిటీ వివరించారు. రావేప్ విద్యార్థులు చేపడుతున్న వ్యవసాయ విధానాలను రోల్‌ప్లే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా ఆ వర్గం రైతులకు అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకంలో భాగంగా సీపీసీఆర్ఐ అధికారులు కొబ్బరి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు బదనికలు, ట్రైకోడెర్మా, బయో కంట్రోల్ ఏజెంట్లను పంపిణీ చేశారు. అనంతరం అగస్టీన్ జెరార్డ్‌ను చలపతిరావుతో పాటు శాస్త్రవేత్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీసీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎలైన్ అప్సర, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సుమిత, కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ జి.రామానందం తదితరులు పాల్గొన్నారు.


రైతులకు బదనికలను పంపిణీ చేస్తున్న సీపీసీఆర్ఐ పీడీ అగస్టీన్ జెరార్డ్

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో అదరగొట్టిన 'వందన'

నాలుగు పతకాలు కైవసం

అమలాపురం టౌన్/అల్లవరం: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ (ఆసియా) పోటీల్లో అమలాపురం మద్దాలవారిపేటకు చెందిన పిల్లి వందన సత్తా చాటింది. ఒక రజత, మూడు కాంస్యం కలిపి ఏకంగా నాలుగు పతకాలు సాధించింది. మలేషియాలోని జోహోర్ బారూలో జరుగుతున్న 2023 ఏషియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా తరఫున వందన పాల్గొంది. సబ్ జూనియర్స్ 84 కేజీల కేటగిరీలో ఓవరాల్‌గా తృతీయ స్థానం కైవసం చేసుకుని కాంస్య పతకం సాధించింది. పవర్ లిఫ్టింగ్ స్క్వాట్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలచి రజత పతకం కైవసం చేసుకుంది. అలాగే బ్రెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో తృతీయ స్థానాలు సాధించి కాంస్య పతకాలు దక్కించుకుంది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన వందన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సాయిబాబా అమలాపురంలో నివాసం ఉంటున్నారు. వెంకటలక్ష్మి దేవగుప్తం హైస్కూలులో టీచర్‌గా పని చేస్తున్నారు. సాయిబాబా ఇక్కడే ఒక ప్రైవేటు స్కూలులో పని చేస్తున్నారు. భీమవరంలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న వందన.. అమలాపురంలోని హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందింది. అంతర్జాతీయ స్థాయిలో తన కుమార్తె విజయం సాధించడంతో వెంకటలక్ష్మి తన పాఠశాలలో స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. వందన ఈ నెల 16న మలేషియా నుంచి సొంతూరు అమలాపురం చేరుతుందని హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వందనను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ అభినందించారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోనసీమ ప్రాంతానికి ఆమె ఓ గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.


సాధించిన పతకాలతో వందన

ప్రయాణికురాలికి బంగారం వస్తువు అందజేత

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సుమారు రూ.1.20 లక్షల విలువైన రెండున్నర కాసుల బంగారు వస్తువును బాధితురాలికి రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్బం సోమవారం అందజేశారు. వివరాలివీ.. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన అడపా నాగమణి గత శనివారం సర్వీసు నంబర్ ఇ–601799 ఆర్టీసీ బస్సులో కాకినాడ నుంచి పెదబ్రహ్మదేవం గ్రామం వరకూ ప్రయాణించారు. బస్సు దిగేలోపు ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల బంగారు పుస్తెలతాడు తెగి పడిపోయింది. బస్సు దిగిన వెంటనే పుస్తెలతాడు కనిపించక పోవడంతో డిపో అధికారులను సంప్రదించి, బస్సు కండక్టర్ బీయూ నాగమణి ఫోన్ నంబర్ తెలుసుకుని, నాగమణి సమాచారం అందించారు. బస్సులో ఆమె కూర్చున్న ప్రాంతంలో బంగారు వస్తువు ఉందని గుర్తించిన కండక్టర్.. దానిని రాజమహేంద్రవరం డిపోలోని లాస్ట్ పార్టీలో డిపాజిట్ చేశారు. తన బంగారు పుస్తెల తాడు బస్సులో పడిపోయిన విషయాన్ని ధ్రువీకరిస్తూ బస్ టికెట్, ఇతర వివరాలను నాగమణి తెలియజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్బం తన కార్యాలయంలో సిబ్బంది, సెక్యూరిటీ సమక్షంలో ఆ బంగారు వస్తువును నాగమణికి అందజేశారు.


బంగారు వస్తువును యజమానికి అందజేస్తున్న డిపో మేనేజర్ షేక్ షబ్బం

వచ్చే నెలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు

అమలాపురం రూరల్: వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ విద్యా సంస్థల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తామని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాసభల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైతన్య రాజు మాట్లాడుతూ, తెలుగు మహాసభలను జిల్లాలోని కవులు, రచయితలు, మేధావులు, రాజకీయ, ప్రజానాయకులందరూ విజయవంతం చేయాలని కోరారు. సన్నాహక సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు అయ్యాజీ వేమా, అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నాని రాజు, వివిధ సంఘాల నేతలు డీబీ లోక్, మోకా సుబ్బారావు, వాసంశెట్టి సుభాష్, డీవీఎస్ రాజు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న చైతన్య రాజు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు
- ఓవరాల్ చాంపియన్‌గా కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 26వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల రీజినల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ బహుమతి ప్రదానోత్సవం సోమవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువతకు క్రీడలపై ఆసక్తి కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అందులో భాగమేనని అన్నారు. రాజమహేంద్రవరంలో పలు క్రీడా ప్రాంగణాలు, క్రికెట్ స్టేడియం నిర్మాణాలు చేపట్టబోతున్నామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీ భరత్‌రామ్ బహుమతులు అందజేశారు. ఓవరాల్ ట్రోఫీని కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల చేజిక్కించుకుంది. ఈ పోటీల్లో 22 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 558 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గెయిల్ సీనియర్ మేనేజర్ బాలాజీ, కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, గేమ్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ ఆర్‌పీఆర్ విఠల్, పాలిటెక్నిక్ కళాశాల వివిధ విభాగాల హెడ్‌లు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్